నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 29 అక్టోబర్ 2024 | HYDERABAD

బంజారాహిల్స్ రోడ్ నం. 12లో సోమవారం ట్రాఫిక్ జామ్ కావడంతో అవస్థలుపడుతున్న వాహనదారులు

పగలు ఉక్కపోత.. రాత్రి చలి పంజా

సిటీబ్యూరో, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి మించి నమోదవుతున్నాయి. మరోవైపు రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీంతో పగలు ఉక్కపోత, రాత్రి సమయాల్లో వాతావరణం చల్లగా మారుతున్నది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ 33.2, కనిష్ఠం 19.7 డిగ్రీలు, గాలిలో తేమ 50 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

అధైర్యపడకండి.. మేమున్నాం
బుచ్చమ్మ కుటుంబానికి కేటీఆర్ పరామర్శ

హైడ్రా భయంతో సెప్టెంబర్ 27న కూకట్‌పల్లిలో ఆత్మహత్య చేసుకున్న బుచ్చమ్మ కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. 'మీకు అండగా మేమున్నాం.. అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తాం.అధైర్యపడకండి.. ధైరంగా ఉండండి'.. అంటూ భరోసా కల్పించారు. 'బుచ్చమ్మది ఆత్మహత్య కాదు...? హైడ్రా అనే అరాచక సంస్థతో రేవంత్‌రెడ్డి చేయించిన హత్య' అని ఆరోపించారు. సర్కారు దిక్కుమాలిన చర్యల కారణంగా పేదలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. బుచ్చమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే హైడ్రా కూల్చివేతల కారణంగా ఇంట్లోని పుస్తకాలు కోల్పోయిన చిన్నారి వేదశ్రీ కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. పలువురు చిన్నారులకు పుస్తకాలు, బ్యాగులను అందజేశారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు. - బాలానగర్, అక్టోబర్ 28

నగర ప్రజలపై ఆంక్షల కత్తి

ఆందోళనలకు భయపడుతూ 163 అమలు • నెల రోజుల ఆంక్షలపై సర్వత్రా విమర్శలు

ప్రభుత్వం నగరంలో 163 ఆంక్షలు విధించింది. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కలిసి కట్టుగా ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాల్సిన దీపావళి పండుగ వేళ .. ఆంక్షల పేరిట నగరవాసుల సంతోషాలను కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నది. సమస్యల పరిష్కారం కోసం వివిధ వర్గాలు వరుస ఆందోళనలు చేస్తుండటంతో సర్కారు జంకుతున్నది. ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడవద్దంటూ.. నిషేధాజ్ఞలు అమల్లోకి తెచ్చి పరోక్షంగా కర్ఫ్యూ విధించిందనే విమర్శలు వస్తున్నాయి.

-సిటీబ్యూరో, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ)

ఐదుగురి కంటే ఎక్కువ మంది ఉంటే..

ఓ వైపు బెటాలియన్ పోలీసుల ఆందోళన... మరో వైపు సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేసే యోచనలో ఉన్న హోంగార్డులు.. వీళ్లతో పాటు మరిన్ని వర్గాలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ఒకరి వెంట ఒకరు ఆందోళన బాటపడుతూ.. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతుండటంతో ఏ వర్గం నుంచి మెరుపు ఆందోళనలు ఎక్కడ జరుగుతుందననే భయం ప్రభుత్వానికి ఉన్నదన్న చర్చ జరుగుతున్నది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్, సికింద్రాబాద్‌లో 163 సెక్షన్(144)ను అమలు చేస్తుండటంతో దీపావళి పండుగ వేళ స్నేహితులు, కుటుంబ సభ్యులు, కాలనీల్లో కలిసికట్టుగా ఆనందోత్సవాల్లో చేసుకునే పరిస్థితికి దూరమవుతామని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌లో శాంతి యుత ఆందోళనలు ఇందిరా పార్కులోని ధర్నా చౌక్ వరకే పరిమితమని, నెల రోజుల పాటు నగర వ్యాప్తంగా 163 ఆంక్షలు అమలు చేస్తున్నా. ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడవద్దంటూ హైదరాబాద్, సికింద్రాబాద్ వ్యాప్తంగా ఈ నిషేధాజ్ఞలు అమల్లోకి తెచ్చి పరోక్షంగా ప్రభుత్వం కర్ఫ్యూ విధించిందనే విమర్శలు వస్తున్నాయి.

షాపింగ్ చేయకుండా కట్టడి..

నిర్ణీత ప్రాంతంలో ఏదైనా కార్యక్రమం జరుగుతుందంటే అక్కడ అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు ఇలా ప్రత్యేకంగా ఆయా ప్రాంతాల్లో అప్పుడప్పుడు పోలీసులు 144 సెక్షన్ అమలు చేస్తుంటారు. వారం రోజుల పాటు అమలు చేస్తూ వాటిని అవసరమైతే పొడిగిస్తూ వెళ్తారు. అయితే ఏకంగా నెల రోజుల పాటు హైదరాబాద్ వ్యాప్తంగా ఈ ఆంక్షలు అమలులోకి తేవడంతో ఒక్కసారిగా నగర ప్రజలు ఉలిక్కిపడ్డారు. స్నేహితుల, బంధువులతో వెళ్లి పటాకులు కొనలేని పరిస్థితి.. కలిసి పటాకులు కాల్చుకోలేని దుస్థితి. కలిసికట్టుగా షాపింగ్ చేయకుండా ఇలా కట్టడి చేయడం ఏమిటంటూ.. నగర ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అన్ని వర్గాలకు హామీలు ఇచ్చింది.. ఆ హామీలను నెరవేర్చలేక చేతులెత్తిసింది... మరో వైపు హైదరాబాద్‌లో హైడ్రా, మూసీ పేర్లతో పేదవారికి కంటినిండా నిద్రలేకుండా చేసింది. ఇంతలోనే ఏకంగా పోలీసు వ్యవస్థలో అనాలోచితమైన నిర్ణయాలు తీసుకుంటూ బెటాలియన్ ఫోర్స్‌ను ఇబ్బందులకు గురిచేసేందుకు ప్రయత్నించడంతో వారంతా ప్రభుత్వ తీరుపై నిరసన బాట పట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా బెటాలియన్లలో పోలీసులు ఆందోళన చేస్తూ ప్రభుత్వంపై తిరుగుబాటు ఎగుర వేశారు. ఇదిలా ఉంటే హోంగార్డులు సైతం ప్రభుత్వంపై రగిలిపోతున్నారు. ఇటీవల హోంగార్డులు చాలీచాలని జీతాలు, వచ్చే జీతాలు కూడా సమయానికి రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో పాటు మరిన్ని సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇటీవల పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమం సందర్భంగా గోషామహల్ స్టేడియం నుంచి పోలీసులను ఉద్దేశించి మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి..కనీసం హోంగార్డుల పేరు కూడా ప్రస్తావించ లేదు. ప్రతిపక్షంలో ఉండగా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 100 రోజుల్లో అన్ని సమస్యలు పరిష్కరిస్తానంటూ హామీ ఇచ్చిన సీఎం.. మమ్మల్ని మర్చిపోయారంటూ హోం గార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెటాలియన్ సిబ్బంది ఆందోళన బాట పట్టడంతో ఇప్పుడు సెక్యూరిటీ బాధ్యతలు మొత్తం ఏఆర్, సివిల్ పోలీసులకు అప్పగిస్తున్నారు.

దీపావళి పండుగ కోసం కాదు

'దీపావళి సందర్భంగా హైదరాబాద్‌లో ఆంక్షలు విధించలేదు. కొన్ని వర్గాలు వివిధ రకాలుగా ఆందోళనలకు ప్రయత్నిస్తున్నాయి. సచివాలయం, సీఎం ఇల్లు, డీజీపీ ఆఫీస్, రాజ్‌భవన్ తదితర కేంద్రాల వద్ద అకస్మాత్తుగా ఆందోళనలు చేసే అవకాశాలున్నాయని ఇంటెలిజెన్స్ నివేదిక రావడంతో నోటిఫికేషన్ ఇచ్చాం. ఇది పోలీసులు తీసుకునే చర్యలకు న్యాయపరంగా మద్దతు ఉంటుంది. ఆందోళన కారులను అరెస్ట్ చేసేందుకు అవకాశముంటుంది. ఇది దేశ వ్యాప్తంగా పోలీసులు చర్యలో సాధారణ ప్రక్రియలో భాగం. ఇది కర్ఫ్యూ కాదు.. కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆనందోత్సవాలతో పండుగలు జరుపుకోవాలి' అంటూ సీపీ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. – **హైదరాబాద్ సీపీ, సీవీ ఆనంద్ ట్వీట్**

బిల్లులు వసూలు చేస్తేనే జీతాలు
ఉద్యోగుల వేతనాలకు జీహెచ్ఎంసీ వెంపర్లాట

- కనీసం రూ.100 కోట్లయినా వసూలు చేయండి
- బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లపై ఉన్నతాధికారుల ఒత్తిడి

జీహెచ్ఎంసీలో విచిత్ర పరిస్థితి నెలకొన్నది.. ప్రభుత్వ ఉద్యోగులకు 1న జీతాలు ఇస్తున్నామని సర్కారు గొప్పలు చెబుతుంటే...వచ్చే నెలలోనైనా కనీసం 1న ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని ప్రతి నెలా చివరి వారంలో బల్దియా ఆరాటపడుతున్నది. కానీ జీహెచ్ఎంసీ ఆర్థిక విభాగం ఆరాటం.. ఆచరణలో సాధ్యపడటం లేదు.. దీనికి కారణం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న బల్దియాను ఆదుకోవడంలో ప్రభుత్వం 'చే'తులెత్తేయడమే.. ఈ పరిస్థితుల్లో ఖజానాను స్వతహాగా బలోపేతం చేసుకునేందుకు ఆస్తిపన్ను వసూలు చేస్తేనే జీతాలు ఇస్తామంటూ కొత్త రాగం ఎత్తుకోవడం ఉన్నతాధికారులకే చెల్లింది.

-సిటీబ్యూరో, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ)

ఆస్తిపన్ను వసూళ్లలో..

జీహెచ్ఎంసీ ఖజానా నానాటికీ బక్కచిక్కిపోతున్నది.. వాస్తవంగా సంస్కరణలతో ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్ల మెరుగుదల, నిర్మాణ రంగ అనుమతుల ద్వారా ఆదాయం, ఖర్చుల భారం తగ్గించుకోవడం..కానీ ఆస్తిపన్ను వసూళ్లలో కొందరి బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ల చేతివాటం, రెసిడెన్షియల్ నుంచి కమర్షియల్ కేటగిరీలోకి మారిన భవనాలపై ఫోకస్ చేయకపోవడం, కొత్త భవనాల అసెస్‌మెంట్‌లో నిర్లక్ష్యం , దాదాపు రూ. 6,900 కోట్ల ఆస్తిపన్ను బకాయిల రాబడిలో పనితీరు శూన్యమనే చెప్పాలి. ఇక గతంలో కంటే నిర్మాణ రంగ అనుమతులు తగ్గడం, ఇప్పటి వరకు రూ.200 కోట్ల మేర లోటు ఏర్పడింది. ఇక ఖర్చుల భారం తగ్గించుకోవాల్సిన సమయంలో ఒకవైపు కార్పొరేటర్లు ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం పేరిట టూర్లు వేయగా, దాదాపు రూ.కోటిన్నర ఖర్చు కావడం కొసమెరుపు.

గాడి తప్పిన పాలన..

కమిషనర్ నుంచి ఉన్నతాధికారుల పర్యవేక్షణలో లోపంతో జీహెచ్ఎంసీ పాలన గాడి తప్పింది. పౌరుల మౌలిక సదుపాయాల కల్పన దేవుడెరుగు, ఉద్యోగుల నెలవారీ వేతనాలు సకాలంలో వచ్చే పరిస్థితులు లేవు. ప్రతి నెలా ఉద్యోగుల జీతాల చెల్లింపులకు ఆర్థిక విభాగం నానా తంటాలు పడుతున్నది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఉన్నతాధికారులు ఆస్తిపన్ను బకాయిలు, నెలవారీ టార్గెట్లు పూర్తి చేయాలంటూ బిల్ కలెక్టర్లు , ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 31వ తేదీలోగా రూ. 100కోట్లు వసూలు చేయాలని, అలా చేస్తేనే జీతాలు వస్తాయంటూ ఉన్నతాధికారులు ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలోనే గత నెల 5న జీతాలు ఇచ్చిన బల్దియా.. పండుగ మరుసటి రోజైనా వేతనాలు వస్తాయా? వచ్చే నెలలో ఎప్పుడు ఇస్తారో అన్న చర్చ ఉద్యోగుల్లో జరుగుతున్నది.

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న హరి ఆంజనేయులు

అమోయ్ అన్యాయం చేశారు

మధురానగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్

ఖైరతాబాద్: ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్ మా ప్లాట్లను అప్పనంగా ప్రైవేట్ బిల్డర్స్‌కు కట్టబెట్టారని మధురానగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఆరోపించింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం అసోసియేషన్ ప్రతినిధులు హరి ఆంజనేయులు, లక్ష్మారెడ్డి, సత్యనారాయణ, రాంభూపాల్, నర్సింహారెడ్డి మాట్లాడారు. తట్టిఅన్నారం గ్రామంలోని సర్వే నంబర్ 108, 109, 110, 111లో సుమారు 70.39 ఎకరాల భూమి ఉందని, ఆ వెంచర్‌లో 1980 నుంచి 2005 సంవత్సరాల మధ్య సుమారు 800 మంది ప్లాట్లను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. అందుకు సంబంధించిన అన్ని పన్నులు ప్రభుత్వానికి కడుతున్నారన్నారు. 2005లో కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి ఈ స్థలం తమది కాదంటూ వాదించారని, దీంతో కోర్టును ఆశ్రయించగా, 2009లో తమకు అనుకూలంగా తీర్పునిచ్చిందని, అంతేకాకుండా 2012లో చట్టబద్ధత కోసం తహసీల్దార్ వద్ద ట్రిబ్యూనల్‌లో పిటిషన్ వేశామని, ప్రస్తుతం ఆ కేసు నడుస్తున్నదన్నారు. 2020లో అమోయ్ కుమార్ జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లను పరిగణంలోకి తీసుకోకుండా, రెవెన్యూ కోర్టులో పెండింగ్ ఉన్న కేసును పట్టించుకోకుండా ఆమోద బిల్డర్స్‌కు కట్టబెట్టారన్నారు.

టీచర్ల భర్తీలో అక్రమాలు
చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు

సిటీబ్యూరో, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : టీచర్ల భర్తీలో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని డీఎస్సీ అభ్యర్థులు కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఎస్‌టీ కేటగిరీలో 11 పోస్టులను భర్తీ చేయలేదని ఆరోపించారు. ఆ పోస్టులను ఎందుకు భర్తీ చేయడం లేదని.. తమకు పలు అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. భర్తీ చేయకపోవడంపై జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లినా.. పట్టించుకోలేదని చెప్పారు. ఎస్‌టీ కేటగిరీయే కాకుండా అన్ని కేటగిరీల్లోనూ హైదరాబాద్ సంబంధిత అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. టీచర్ల భర్తీ ప్రక్రియపై విచారణ జరిపి రీ వెరిఫికేషన్ చేయాలని డిమాండ్ చేశారు. సర్టిఫికెట్లను సరిగా పరిశీలించకుండానే టీచర్ల భర్తీ జరిగిందన్నారు. టీచర్ల భర్తీపై విచారణ చేసి హైదరాబాద్ స్థానిక అభ్యర్థులమైన తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు డీఎస్సీ అభ్యర్థులు సుజాత, లలిత, అరుణ, సంగీత, గోవింద్ సింగ్ తదితరులు మొరపెట్టుకున్నారు. కాగా హైదరాబాద్ టీచర్ల భర్తీలో అవకతవకలు జరిగినట్టు వార్తలు రావడంతో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి భర్తీ ప్రక్రియపై స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ విచారణకు ఆదేశించారు. సదరు డీఈఓ, డిప్యూటీ ఈఓ, డిప్యూటీ ఐఓఎస్‌ల నుంచి వివరాలు సేకరించి.. కలెక్టర్‌కు రిపోర్ట్ అందించినట్టు ప్రత్యేక అధికారి జ్యోతి తెలిపారు. అయితే ఈ రిపోర్ట్‌ను కలెక్టర్ పరిశీలించిన అనంతరం బాధ్యులపై శాఖాపరమైన చర్యలు ఉండనున్నాయి. హైదరాబాద్‌లో డీఎస్సీ 2024లో 584 మంది అభ్యర్థులకు పోస్టింగ్ ఇచ్చారు. 878 పోస్టులకు గాను కోర్టు కేసులు, రిజర్వేషన్ కేటగిరీలో అభ్యర్థుల కొరత, ఇన్ సర్వీస్ తదితర కారణాలతో 262 పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయి.

మోమోస్ తిని.. మహిళ మృతి
వందలాది మందికి అస్వస్థత
నిర్వాహకులపై కేసు నమోదు
తయారీ కేంద్రాన్ని సీజ్ చేసిన అధికారులు

బంజారాహిల్స్: అపరిశుభ్రమైన వాతావరణంలో కల్తీ పదార్థాలతో తయారు చేసిన మోమోస్ తిని ఓ మహిళ మృతిచెందగా, సుమారు 100 మందికి పైగా ఆస్పత్రిపాలయ్యారు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. బంజారాహిల్స్ రోడ్ నం. 10లోని సింగాడకుంటలో నివాసం ఉంటున్న రేష్మా బేగం(31) తన ఇద్దరు పిల్లలు రెమిషా(12), రఫియా(11)తో కలిసి శుక్రవారం సాయంత్రం స్థానికంగా వారాంతపు సంతకు వెళ్లింది. అక్కడ రోడ్డు పక్కన ఢిల్లీ హాట్ మోమోస్ పేరుతో స్టాల్‌లో అందరూ మోమోస్ తిన్నారు. ఇంటికి వెళ్లాక అరగంటలోనే పిల్లలిద్దరితో పాటు రేష్మాబేగం తీవ్రమైన కడుపు నొప్పితో పాటు వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శనివారం తీవ్ర ఇబ్బందులు పడిన పిల్లలు ఇద్దరూ రాత్రికి కోలుకున్నారు. అయితే రేష్మా బేగం అపస్మారక స్థితిలోకి చేరుకున్నది. దీంతో ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు నిమ్స్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. కాగా, సింగాడకుంటతో పాటు నందినగర్, గౌరీశంకర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో కూడా చాలామంది ఇదే విధంగా వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నట్లు ఆదివారం రాత్రి బయటపడింది. వీరందరూ అనారోగ్యానికి గురికావడానికి కారణమైన ఢిల్లీ హాట్ మోమోస్ సంస్థ తరపున విక్రయించిన ఎండీ. రజాక్(19), చింతల్‌బస్తీలోని సంస్థ యజమాని ఎండీ. అర్మాన్(35)పై చర్యలు తీసుకోవాలని బాధితులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నందినగర్‌లో మోమోస్ విక్రయించిన రజాక్, సింగాడకుంటలో అమ్మిన సాజీద్ హుస్సేన్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇదిలా ఉండగా ఖైరతాబాద్‌లోని చింతల్‌బస్తీలో మోమోస్ తయారు చేస్తున్న వావ్ హాట్ మోమోస్, ఢిల్లీ హాట్ మోమోస్ సంస్థల్లో బల్దియా అధికారులు దాడులు నిర్వహించారు. ఎలాంటి ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేకుండానే ఇక్కడ ఆహార పదార్థాలు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. అపరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేసిన మోమోస్, వాటిలో వినియోగిస్తున్న పదార్థాల నమూనాలను సేకరించి, స్టేట్ ఫుడ్ ల్యాబ్‌కు పంపించారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు తయారీ కేంద్రాన్ని మూసేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ వ్యవహారంలో లోతుగా దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బంజారాహిల్స్ పోలీసులకు లేఖ రాశారు. కాగా, నందినగర్‌లో మోమోస్ తినడంతో తీవ్ర అస్వస్థతకు గురై పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ కవితారెడ్డి పరామర్శించారు.

రేష్మా బేగం(ఫైల్)